సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 18 । జనవరి । 2023



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 **ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.**



పశ్చిమ జట్టు విజయం

ఆకివీడు: రాష్ట్ర స్థాయి మహిళా వాలీబాల్, కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. వాలీబాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి (సీనియర్స్) ప్రథమ స్థానం సాధించింది.



మండోదరమ్మ గ్రామోత్సవం

ఆకివీడు: గుమ్ములూరులో మండోదరమ్మ జాతర గ్రామోత్సవం వైభవంగా జరిగింది. నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ దర్శించుకున్నారు.

రైతుకు పండుగ

- **ఖరీఫ్ ధాన్యం కొను**గోళ్ల సొమ్ములు జమ
- **అనుకున్న సమయాని**కే ఖాతాల్లోకి నగదు
- **ఉమ్మడి జిల్లాలో ని**ర్దేశించిన లక్ష్యం **మేరకు ధాన్యం కొను**గోళ్లు
- **ఇంతవరకూ రూ.** 1359 కోట్ల జమ
- **హమాలీ, నంచులు, రవాణా చార్జీలు కూడా..**

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాట నిలుపుకోవడంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందువరుసలో ఉంటారు. చెప్పిన సమయానికే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల సొమ్ముల్ని ఖాతాల్లో జమ చేయడంతో రైతన్నలు సంబరపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు అన్ని విధాలా సర్కారు అండగా నిలుస్తుందనేందుకు ఇదే నిదర్శనమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖరీఫ్‌లో వేగంగా ధాన్యం కొనుగోళ్ళు చేయడమే కాకుండా నిర్దేశించిన కాలవ్యవధిలోనే సొమ్ము చెల్లింపు ప్రక్రియను పూర్తి చేశారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం మద్దతు ధరతో పాటు రవాణా చార్జీలను కూడా కలిపి ఏకకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రికార్డు స్థాయిలో నగదు జమ ప్రక్రియ కూడా కొనసాగుతుంది. సంక్రాంతి పండుగ రోజుల్లో జిల్లాలో రైతులకు నగదు చెల్లింపులు చేయడం విశేషం. ఇంత వరకు రెండు జిల్లాల్లో రైతుల ఖాతాల్లో రూ.1359 కోట్లు జమ చేశారు. ఇప్పటికే గ్రామగ్రామాన రైతుభరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తున్న సర్కారు రైతు పండించిన పంట విషయంలోనూ, రైతుకు ఎలాంటి



భీమడోలు మండలం పూళ్లలో ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటుంది.

కొనుగోలు లక్ష్యం పెంపు : సోమవారం ఒక్కరోజే పశ్చిమగోదావరి జిల్లాలో రూ.129 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.126 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ విధంగా నిర్దేశించిన సమయానికి కంటే ముందే రైతులకు సొమ్ములు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలో 63,565 మంది రైతుల నుంచి, ఏలూరు జిల్లాలో 46,696 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు మరింత మంది నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలులో నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో ఉన్నప్పటికీ మరింతగా ధాన్యం ఉత్పత్తయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కొనుగోలు లక్ష్యాన్ని మరింతగా పెంచారు. కొనుగోలు సమయాన్ని సైతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం సొమ్ములను జమ చేసి.. రైతులు కష్టానికి సరైన సమయంలో ప్రతిఫలాన్ని అందిస్తోంది.

పశ్చిమలో రూ. 729 కోట్లు.. ఏలూరులో రూ.630 కోట్లు జమ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏలూరు జిల్లాలో 3.83 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా 3.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 3.67 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా.. 3.65 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులు పండించిన పంటను ఎప్పటికప్పుడు రైతుల వద్ద నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్దేశించిన సమయానికి రైతు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుంది. ఇంతవరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా రూ.680 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు రూ.630 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.749 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు రూ.729 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు జిల్లాలో ఇంకా రూ. 50 కోట్లు చెల్లించాల్సి ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.20 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఈ నిధులు సైతం రెండు, మూడు రోజుల్లో చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనుకున్న సమయానికే రైతులకు సొమ్ములు చెల్లిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు నుంచి ధాన్యం సొమ్ములు జమయ్యే వరకు పర్యవేక్షిస్తున్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ



రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తూనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కంటే ముందుగానే సొమ్ములు జమ చేస్తూ రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాము. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

– పి.అరుణ్‌బాబు, జేసీ, ఏలూరు జిల్లా

రైతులకు ఇబ్బందులు లేకుండా..



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కళ్లాల వద్దనే ధాన్యం కొనుగోలు చేసి, అదే విధంగా రైతులు పండించిన ప్రతి గింజకు విలువ కట్టి రైతుల ఖాతాల్లోనే నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా జమచేస్తున్నాం. రైతులకు అన్యాయం జరగకుండా పూర్తి స్థాయిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– ఈ.మురళీ, జేసీ, పశ్చిమగోదావరి జిల్లా

న్యూస్‌రీల్

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



అత్తిలి మండలం ఆరవల్లిలో వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడుతున్న జట్లు

అత్తిలి: యోగి వేమన 98వ జయంత్యుత్సవాలలో భాగంగా ఆరవల్లిలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆరవల్లి జట్టుపై వెస్ట్ గోదావరి యూత్, వెస్ట్ గోదావరి జూనియర్స్‌పై కృష్ణా, ఆరవల్లిపై డీఎన్నార్ పాలకోడేరు, డీఎన్నార్ పాలకోడేరు జట్టుపై వెస్ట్‌గోదావరి యూత్ జట్లు గెలుపొందాయి. బుధవారం జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌కు వెస్ట్ గోదావరి యూత్, డీఎన్నార్ పాలకోడేరు, కృష్ణా, ఈస్ట్ గోదావరి జట్లు ఎంపికయ్యాయి. వాలీబాల్ టోర్నమెంట్‌కు సత్యనారాయణ, గంగాధర్, రామకృష్ణ, పోసిబాబులు రిఫరీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, వాలీబాల్ పోటీల నిర్వాహకులు సత్తి వీర్రెడ్డి, వెలగల కృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: రిటైర్డ్ ఉద్యోగులకు ఆధార్‌తో సీఎఫ్ఎంఎస్, ఫోన్ నంబర్ల అనుసంధానం విషయంలో అనేక సందేహాలు, ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, ఎస్.సత్యనారాయణ రాజు జిల్లా ఖజానాధికారి(డీటీఓ) గణేష్‌కు వివరించారు. మంగళవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు. దీనిపై స్పందించిన డీటీఓ గణేష్ అనుసంధానం చేయించడంలో ఆందోళన అవసరం లేదని.. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇంటికి వచ్చి ట్రెజరీ సిబ్బంది లైఫ్ సర్టిఫికెట్ తీసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జేమ్స్, సత్యనారాయణరాజు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్, తదితరులు

తాడేపల్లిగూడెం: వృక్ష ఆధారిత పురుగుమందుల తయారీ, సేంద్రియ వ్యవసాయంలో సస్యరక్షణ అంశంపై ఉద్యాన వర్సిటీ కేవీకేలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. గురుగ్రాంకు చెందిన పురుగుమందుల సూత్రీకరణ సంస్థ, ఉద్యానవర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐపీయఫ్‌టీలో జరిగిన పరిశోధనల గురించి డాక్టర్ జితేంద్రకుమార్ వివరించారు. ఉద్యాన వర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలలో పురుగుమందుల వినియోగం ,వాటి అవశేషాల గురించి వివరించారు. వేపగింజల కషాయం, వేప నూనె, ఎస్‌పీవీ.ద్రావణం, సస్యరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయంలో కీటకనాశనుల వినియోగంపై కెవికె ప్రధానశాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ వివరించారు.

935 మంది జూదరుల అరెస్టు

సాక్షి, భీమవరం: సంక్రాంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తున్న శిబిరాలపై దాడులు చేసి 935 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు చేసిన దాడుల్లో కోడి పందేల శిబిరాలపై దాడులు చేసి 174 కేసులు నమోదు చేసి 409 మంది అరెస్టు చేయగా వారి నుంచి రూ.1,88,400 నగదు, 210 కోడి పుంజులు, 227 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుండాట, జూదాలు నిర్వహిస్తున్న వారిపై 186 కేసులు నమోదు చేసి 526 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9,29,436 స్వాధీనం చేసుకున్నామన్నారు. పందేలు, జూదాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో దాడులు చేశామని, గుండాట, జూదాలు అడ్డుకోవడమే కాకుండా బోర్డులు, టెంట్‌లు తొలగించి కేసులు నమోదు చేశామన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

అత్తిలి: పాలిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను బుధవారం మంత్రులు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడాలి నానిలచే రైతు భరోసా, సచివాలయ భవనాల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఆరవల్లిలో వేమన జయంతి ఉత్సవ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యే హాజరవుతారన్నారు.

ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

నరసాపురం రూరల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు ఇచ్చిన ప్రతీ రైతుకూ తగిన న్యాయం చేస్తామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మండలంలోని వైఎస్ పాలెం పంచాయతీ పరిధిలో పితినివారి మెరక రైతు భరోసా కేంద్రం వద్ద రాజుల్లంక, లక్ష్మణేశ్వరం, వైఎస్‌పాలెం, సీతారాంపురం ప్రాంతాల్లోని 9.7 కిలోమీటర్ల పరిధిలో భూములు ఇచ్చిన రైతులతో ముదునూరి ప్రసాదరాజు, జాయింట్ కలెక్టర్ జేవీ మురళీ సంయుక్తంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ మన ప్రాంత అభివృద్ధిలో రైతులంతా భాగస్వామ్యం కావాలని అన్నారు. నిబంధనల మేరకు పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. భూమి వివరాలను పరిశీలించి ప్రభుత్వ ధరకు రెండున్నర రెట్లు వచ్చేలా కృషిచేస్తానన్నారు. లక్ష్మణేశ్వరంలో ఇప్పటికే కొన్ని స్థలాలలో ఇళ్ల నిర్మాణాలు, కొబ్బరి చెట్లు ఉన్నాయని రైతులు పేర్కొనడంతో వాటికి సంబంధించి నష్టపరిహారం అందజేయడానికి పరిశీలిస్తామన్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ దస్తావేజులు అగ్రిమెంట్లు కొన్ని భూములకు లేవని, వారికి కూడా న్యాయం చేయాలని రైతులు కోరారు. భూ రికార్డులను పరిశీలించి వాస్తవ భూమి వివరాలను తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను చీఫ్ విప్ కోరారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.



పితాని మెరకలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జేసీ మురళీ

ఆర్టీసీ ఆదాయం రూ.51 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేయడం ద్వారా ఆర్టీసీ రూ.51 లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుంది. హైదరాబాద్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేయడానికి ఏలూరు జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నరసాపురం డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను తిప్పారు. ఏలూరు జిల్లా నుంచి 119 బస్సులను 83,775 కిలోమీటర్లు తిప్పడం ద్వారా సుమారు 9 వేల మంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరవేశారు. దీని ద్వారా ఆర్టీసీ రూ. 26.66 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 89 ప్రత్యేక సర్వీసులను 77 వేల కిలోమీటర్లు తిప్పడం ద్వారా సుమారు 6 వేల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చారు. దీని ద్వారా రూ. 24. 48 లక్షల ఆదాయం వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి అదనపు భారం లేకుండా సాధారణ చార్జీలనే వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఎక్కువ మంది ఆర్టీసీ వైపే మొగ్గు చూపారన్నారు. తిరుగు ప్రయాణంలో కూడా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త

భార్య, పిల్లలకు త్రుటిలో తప్పిన ప్రమాదం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం భార్య, పిల్లలపై పెట్రోల్ పోసి చంపేందుకు భర్త ప్రయత్నించిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామానికి చెందిన తానింకి సురేష్‌కు కౌసల్యతో 2015లో వివాహమైంది. వీరికి కుమార్తె హేమశ్రీ, కుమారుడు అభిలేష్‌లు ఉన్నారు. అయితే చెడు వ్యసనాలకు బానిసైన సురేష్ భార్య కౌసల్యపై అనుమానం పెంచుకుని వేధిస్తుండేవాడు. ఇటీవల అదనపు కట్నం తీసుకు రమ్మని కౌసల్యను వేధిస్తున్నాడు. భార్యాపిల్లలను చంపితే మరో పెళ్లి చేసుకోవచ్చే దురాలోచనతో ఉన్న సురేష్ ముందస్తు ప్రణాళికతో సోమవారం అర్ధరాత్రి మూడు బాటిళ్లలో పెట్రోలు నింపుకుని ఇంటికి తీసుకొచ్చి దాచాడు. భార్య, పిల్లలు నిద్రిస్తుండగా ఇంటి తలుపులు, కిటికీలకు గడియలు పెట్టాడు. నిద్రిస్తున్న భార్యా పిల్లలపై పెట్రోలు పోసి సజీవ దహనం చేసేందుకు నిప్పంటించాడు. వెంటనే చుట్టుపక్కల ఉన్న స్థానికులు గమనించి వెంటనే మంటలను ఆర్పడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. భార్య కౌసల్యకు రెండు కాళ్ల పాదాలు, చేతిపైన కాలడంతో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పిల్లలు సురక్షితంగా ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సురేష్‌పై ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): బడి ఈడు పిల్లలలో రక్తహీనత ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఆరోగ్యశాఖ మరింత శ్రద్ధ చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎనిమిది లక్ష్యాపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించడంతోపాటు, సంబంధిత మందులను రోజుకు రెండుసార్లు చొప్పున అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు, పాఠశాల విద్యార్థులకు, కౌమారదశ బాలికలకు, 15–49 మధ్యగల ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి సరైన ఆహారం, వైద్యం అందించాలని సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించిన రక్త పరీక్షల వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ప్రతి నెల హెచ్చుతగ్గులను నమోదు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలు, పాఠశాలలో కూడా రికార్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఒక్కరు కూడా రక్తహీనతకు గురైన వారు ఉండటానికి వీలులేదని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలు బయట ఉండకూడదన్నారు. ఇంతవరకు 890 మంది బడి బయట పిల్లలను గుర్తించి వారిలో 353 మందిని బడిలో చేర్పించామన్నారు. మిగతా పిల్లలను కూడా బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు, తదితరు అంశాలపై పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

అడ్డాల కుటుంబాలకు ట్రస్ట్ ఏర్పాటు



మాట్లాడుతున్న సినీ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్

సాక్షి, భీమవరం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అడ్డాల కుటుంబాలలోని విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడిన పుడు పాలకొల్లులోని న్యూలైఫ్ ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్యం అందించడానికి 16 మంది సభ్యులతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ సినీ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్, సినీ నిర్మాత అడ్డాల చంటి అన్నారు. పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం అడ్డాల కుటుంబాల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డ్ ఎస్పీ అడ్డాల వెంకటరత్నం మాట్లాడుతూ గత 4 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అడ్డాల వారి కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పానికి ఎస్పీ నాయుడు చేసిన కృషి అభినందనీయమన్నారు. అడ్డాల ట్రస్ట్ ద్వారా ఆయా కుటుంబాల వారికేగాకుండా మిగిలిన కుటుంబాల్లోని అవసరాన్ని తీర్చడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, మూర్తి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు బాసట

- కోల్డ్ స్టోరేజ్, కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి సాయం
- పశ్చిమ గోదావరికి 6 కలెక్షన్ సెంటర్లు, 4 కోల్డ్ స్టోరేజ్‌ల మంజూరు
- ఒక్కో యూనిట్‌పై 75 శాతం సబ్సిడీ

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో ఉద్యాన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతోంది. అలాగే పండ్లు, కూరగాయల గ్రేడింగ్, నిల్వ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ అందిస్తోంది. జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా కూరగాయలు, పండ్ల తోటలు పెంచుతుంటారు. వీటి గ్రేడింగ్, నిల్వ చేసుకోడానికి జిల్లాలో 6 కలెక్షన్ సెంటర్లు, 4 కోల్డ్ స్టోరేజ్‌ల్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సబ్సిడీపై వీటిని ఉద్యానవన శాఖ మంజూరు చేస్తుంది. కోల్డ్ స్టోరేజ్‌లకు రూ.12 లక్షలు, కలెక్షన్ సెంటర్లకు రూ.15 లక్షల రుణం మంజూరు చేస్తుండగా దీనిలో 75 శాతం ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుంది.

సబ్సిడీపై భారీగా రుణాలు

కూరగాయలు, పండ్ల దిగుబడి వచ్చే సమయంలో వాటి ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటిని నిల్వచేసుకునే అవకాశం లేకపోవడంతో అయిన కాడికి అమ్ముకుని సొమ్ము చేసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో రైతులకు లాభాల సంగతి అటుంచి కనీసం పెట్టుబడులు చేతికందని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో కొంతమంది రైతులు కూరగాయలు, పండ్లు పండించడానికి వెనుకడుగు వేస్తున్నారు. రైతుల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని వాటిని నిల్వచేసుకుని ధర బాగున్నప్పుడు అమ్ముకునేలా కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించుకునేందుకు పెద్ద మొత్తంలో సబ్సిడీపై రుణాలు ఇస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణం

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా 6 కలెక్షన్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా 75 శాతం అంటే రూ. 11.25 లక్షలు సబ్సిడీగా ఇస్తున్నారు. ఈ సెంటర్లలో రైతులు పండించిన కూరగాయలు, పండ్ల పంటలను గ్రేడింగ్, క్లీనింగ్ చేసుకోవచ్చు. కొంత సమయం అక్కడ నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక్కడే తూకం మిషన్, టేబుల్స్, కుర్చీలు, ట్రేలు, నీటి సదుపాయం ఉంటుంది. రైతులు తమ పంటలను కలెక్షన్ సెంటర్లకు తెచ్చుకుని అక్కడ వాటిని శుభ్రం చేసుకోవడం, గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌లో విక్రయించవచ్చు.





తాడేపల్లిగూడెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణ దృశ్యం

దీనికి 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్ నిర్మించి రైతులకు అనువుగా సదుపాయాలు ఏర్పాటుచేస్తారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి.

4 కోల్డ్ స్టోరేజ్‌లు మంజూరు

జిల్లాలో పండిస్తున్న కూరగాయలు, పండ్లు నిల్వచేసుకోడానికి 4 కోల్డ్‌స్టోరేజ్‌లు మంజూరయ్యాయి. 10 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఒక్కొక్క యూనిట్ విలువ రూ. 12 లక్షలు కాగా దీనిలో రూ. 9 లక్షలు సబ్సిడీ ఇస్తున్నారు. 1,920 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 10 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు కూలింగ్, సుమారు 90 శాతం తేమ ఉండేలా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణముంటుంది. ఇక్కడ పంటలను సుమారు 25 రోజుల వరకు నిల్వచేసుకునే అవకాశముంటుంది. 100 మంది రైతులు కలసి రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడితే వారికి ఉద్యానవనశాఖ రుణం ఇప్పిస్తుంది.

కోల్డ్ స్టోరేజ్‌లు ఎంతో మేలు



కోల్డ్ స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్లు కూరగాయలు, పండ్లు పండించే రైతులకు ఎంతో ఉపయోగకరం. కోల్డ్ స్టోరేజ్‌లకు రూ. 9 లక్షలు, కలెక్షన్ సెంటర్లకు రూ.11.25 లక్షలు సబ్సిడీగా లభిస్తుంది. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆసక్తి కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకు వస్తే సబ్సిడితో వీటిని మంజూరు చేయిస్తాం.

– ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

మద్యం సొమ్ములో నకిలీ నోటు

వీరవాసరం: మద్యం విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ములో ఓ నకిలీనోటును బ్యాంకు అధికారులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. రాయకుదురులో ఓ మద్యం దుకాణంలో అమ్మకాల అనంతరం వచ్చిన సొమ్మును బ్యాంకులో జమ చేయడానికి మద్యం సిబ్బంది జడ్డు విజయ్‌కుమార్ బ్యాంకుకు మంగళవారం వెళ్లారు. నగదు జమ చేస్తుండగా వాటిలో రూ.500 నకిలీ నోటును బ్యాంక్ సిబ్బంది గుర్తించారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

జంగారెడ్డిగూడెం: ఆటో ఢీకొనడంతో ఓ వృద్ధుడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో నడిపింటి దేవుడు (72) అనే వృద్ధుడు ఈ నెల 15న నడిచి వెళుతుండగా, వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రియా ఆసుపత్రిలో చేర్పించగా, అదేరోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేవుడు మృతి విషయం మంగళవారం కుటుంబ సభ్యులకు తెలిసింది. కుమారుడు జోజిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బిందు సేద్యం.. సాగునీటి కొరతకు కళ్లెం

- బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం
- పరికరాలపై 50 నుంచి 90 శాతం రాయితీ
- సాగునీటి కొరత అధిగమించడమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యసాధనకు కార్యాచరణ

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు అనేక సేవలు అందిస్తోంది. అయితే సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్యను అధిగమించేందుకు సూక్ష్మ సేద్యం రైతులు చేపట్టేలా ప్రోత్సహిస్తోంది. ఈ విధానంలో సాగు చేసేందుకు అవసరమైన బిందు సేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,431 మంది రైతులు సబ్సిడీ పరికరాల కోసం దరఖాస్తు చేయగా, వాటి పంపిణీకి పరిపాలనా ఆమోదం సైతం లభించింది.


తుంపర సేద్యం సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

ఏలూరు (మెట్రో): సూక్ష్మ సేద్య పద్ధతిని అవలంబించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. రైతులకు అవసరమైన ఆధునిక పరికరాలను రాయితీపై పంపిణీ చేయనుంది. జిల్లాలో 15 మెట్ట ప్రాంతాల్లో బిందు, తుంపర సేద్య పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే 10,431 మంది రైతులు నమోదు చేసుకోగా, వీరందరికీ డ్రిప్ పరికరాలను 50 నుంచి 90 శాతం వరకు రాయితీతో అందించనుంది. అలాగే తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే ప్రక్రియపై సూక్ష్మసేద్య పథకంతో ఉద్యానవన శాఖాధికారుల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యాన పంటల సాగుకు జిల్లా కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతి రైతులను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో 6 వేల హెక్టార్లు, పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి హెక్టార్లు, భౌతికలక్ష్యం రూ.60 కోట్లను ఆర్థిక లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 2418.45 హెక్టార్లల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 300 హెక్టార్లల్లో బిందు, తుంపర సేద్యం కోసం రూ.20 కోట్లతో పరిపాలనా మోదం సైతం లభించింది. మార్చి నాటికి జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోనున్నారు.

ఎన్ని ఎకరాలకు ఎంత రాయితీ

ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వస్తుంది. 5 నుంచి 12.5 ఎకరరాలోపు ఉన్న భూమి గల రైతులకు 55 శాతం రాయితీతో బిందు పరికరాలు పొందవచ్చు. అలాగే 5 ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాలకు మించి 12.5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులు 45 శాతం రాయితీపై స్పింక్లర్లను పొందవచ్చు. రాయితీపై డ్రిప్, స్పింక్లర్లు తీసుకున్న రైతులు ఏడేళ్ల తరువాత రెండోసారి సబ్సిడీపై పరికరాలు పొందే వెసులబాటును ప్రభుత్వం కల్పించింది.

దరఖాస్తు చేసే విధానం

బిందు, తుంపర్ల సేద్య పరికరాలను ప్రభుత్వ రాయితీపై పొందాలనుకునే రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రం జత చేసి సంబంధిత వీహెచ్‌ఎ, వీఎఎ, వీఎస్ సంబంధిత గ్రామ ఆర్‌బీకే, జిల్లా మైక్రో ఇరిగేషన్ జిల్లా కార్యాలయంలో బయోమెట్రిక్ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో తప్పనిసరిగా సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలు నేరుగా రైతు ఫోన్‌కే మెసెజ్ ద్వారా తెలియజేస్తారు. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా సబ్సిడీ అర్హత నిర్ణయిస్తారు. రైతు చెల్లించాల్సిన వాటాను ప్రాజెక్టు ఆఫీసర్, ఏపీఎంఐపీ గుంటూరుకు చలానా చెల్లించిన తరువాత దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ నుంచి పరిపాలన ఆమోదం కోసం పంపిస్తారు.

పంటలు.. పరికరాలతో ప్రయోజనాలు

బిందు సేద్యంతో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, జామ, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మొక్కజొన్న, మిరప, చెరకు, స్పింక్లర్ల విధానం ద్వారా వేరుశెనగ, మినుము పంటలకు ప్రయోజనాలు వర్తిస్తాయి. బిందు, స్పింకర్ల సేద్యం ద్వారా నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు. బిందు సేద్యంతో కూలీల ఖర్చు తగ్గుతుంది. నీటిలో కలిపే ఎరువులు, ఫెర్టిగేషన్ విధానం ద్వారా అందించడంతో ఖర్చు తగ్గుతుంది. ఎరువుల వినియోగం సామర్థ్యం పేరిట పంట దిగుబడి నాణ్యత పెరుగుతుంది. పురుగులు, తెగుళ్ల తీవ్రత తగ్గి, కలుపు తీవ్రత ఉండదు.

రైతులందరికీ పరికరాలు అందిస్తాం



సూక్ష్మ, సేద్య పరికరాలను తయారు చేస్తున్న 13 కంపెనీల ద్వారా వీటిని రైతులకు అందిస్తున్నాం. 15 మెట్ట ప్రాంత మండలాల్లో రైతులు బిందు, తుంపర సేద్య పరికరాలు సబ్సిడీపై కావాలనుకునే రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. డ్రిప్ స్ప్రింక్లర్ల పరికరాలు అమర్చిన తరువాత రైతులకు పరికరాల వాడకంపై, డ్రిప్ ద్వారా ఎరువులు అందించే విధానాలపై కంపెనీ ప్రతినిధులు, ఉద్యానశాఖాధికారులు అవగాహన కల్పిస్తారు.

– పీవీఎస్ రవికుమార్, ఏలూరు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

సీబీఎస్‌ఈ సిలబస్ అమలు సరైనదే


షేక్ సాబ్జీ, ఎమ్మెల్సీ

ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో కొత్తగా ప్రవేశపెట్టనున్న సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యార్థుల్లో అవగాహనా సామర్థ్యం పెరుగుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి వచ్చిన ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీబీఎస్‌ఈ విద్యా విధానాన్ని ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలే అమలు చేస్తున్నాయని, ఈ విద్యా విధానం సమర్థనీయమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక స్కూల్‌ను ఎంపిక చేసి సీబీఎస్‌ఈ విద్యా విధానాన్ని అమలుచేయనుందన్నారు. కొత్త సిలబస్‌తో బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలకవచ్చన్నారు. అంతేకాక విద్యార్థులపై భారం తగ్గడమే కాక వారిలో సృజనాత్మక శక్తి, స్వీయ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. సివిల్స్ వంటి వాటికి సీబీఎస్‌ఈ విద్య ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఇష్టం మేరకు సీబీఎస్‌ఈ సిలబస్ చదివించవచ్చని, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు ఈ విద్యా విధానం దోహదం చేస్తుందన్నారు. అలాగే ఈ విద్యావిధానంతో విద్యార్థులు నీట్ వంటి పోటీ పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయరాయికి చెందిన మట్టా సుజాత, అతని భర్త మట్టా తిరుపతయ్య (41) ఈనెల 14న ఏలూరుకు బైక్‌పై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా విజయరాయి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతయ్యకు తీవ్ర గాయాలవ్వగా స్థానికులు అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ మంగళవారం తిరుపతయ్య మృతి చెందాడు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఅండ్‌వీ కెనాల్‌లో కాలుష్యాన్ని అరికట్టండి

- శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- భీమవరం వద్ద కాలువలో వ్యర్థాల పరిశీలన


భీమవరం వద్ద జీఅండ్వీ కెనాల్‌లో వ్యర్థాలను పరిశీలిస్తున్న మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: రెండు నియోజవర్గాల ప్రజలకు తాగునీటిని అందిస్తున్న జీఅండ్‌వీ కెనాల్ వ్యర్థాలతో దుర్గంధంగా మారుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం భీమవరంలోని జీఅండ్‌వీ కెనాల్‌లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ జీ అండ్ వీ కెనాల్ ద్వారా భీమవరం మండలంలోని గ్రామాలతో పాటు నరసాపురం నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు సాగునీటితోపాటు తాగునీరు సరఫరా అవుతోందని, ఎంతో ప్రాధాన్యత కలిగిన జీఅండ్‌వీ కెనాల్ చెత్తాచెదారాలతో నిండి నీరు కలుషితం కావడంతో కాలువలో నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువలో కాలుష్యాన్ని అరికట్టడంలో నీటిపారుదల శాఖాధికారులు విఫలమవుతున్నారని మోషేన్‌రాజు అన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని కాలువలోని వ్యర్థాలను తొలగించాలని, కాలువను కలుషితం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెడుగుడు పోటీల విజేత రాయల్స్ టీమ్


ఉప్పరగూడెంలో చెడుగుడు పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర స్థాయిలో మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన చెడుగుడు పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ విజేతగా ప్రవీణ్ రాయల్స్ టీమ్ (నెల్లూరు), ద్వితీయ స్థానంలో అన్వేష్ వారియర్స్ (ఎర్రగుంటపల్లి), తృతీయ స్థానంలో తన్విక్ కోహ్లీ టీమ్ (ఉప్పరగూడెం), నాలుగో స్థానంలో ఎంవీఆర్ టీమ్ (ఉప్పరగూడెం) నిలిచాయి. బెస్ట్ టీమ్ ఆఫ్ టోర్నమెంట్‌గా వెంకట్రావుపాలెం టీమ్ నిలిచింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, బెస్ట్ టీమ్ ఆఫ్ టోర్నమెంట్‌కు రూ.5 వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండే కనకబాబు, దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, మాజీ సర్పంచ్ రాపాక భానుమూర్తి, దండే చినగోతియ్య, ఏలూరి వీరాస్వామి, దేశాబత్తుల శాంతారావు, మరపట్ల యోహాను, దండే వెంకన్న, దండే ఏసురత్నం, దండే కోటయ్య, మరపట్ల సుబ్బారావు, ఏలూరి వెంకట్రావు, యాతం సత్యానారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ


విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 2023–24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈ నెల 19 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ.సాల్మన్ రాజు చెప్పారు. మంగళవారం ఏలూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పీ.రాజగోపాలరెడ్డి పాల్గొంటారని తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదికలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ, ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 21 వరకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాల్ని విశాఖపట్నం నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అభిప్రాయాలు చెప్పదలుచుకున్న వారికి తమ సమీపంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం నుంచి, డివిజనల్ కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అవకాశం కల్పిస్తామన్నారు. ప్రజలు తమ పేర్లను ప్రతి రోజూ ముందుగానే నమోదు చేసుకోవాలని, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారని, ముందుగా నమోదు చేసుకోనప్పటికీ తమ సమీపంలోని కార్యాలయాలకు చేరుకుని సూచనలు ఇవ్వవచ్చని వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై అభిప్రాయాలు తెలపొచ్చు

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈనెల 19, 20, 21 తేదీల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ డీ కృష్ణానాయక్ మంగళవారం చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మళ్లీ 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందన్నారు. తమ అభిప్రాయాన్ని చెప్పదలిచిన వినియోగదారులు నూజివీడులోని ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని, సలహాలను, సూచనలను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగొచ్చి కొడుతున్నాడని..



ఈడూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యు.రవిప్రకాష్, పసుపులేటి ఆంజనేయులు మృతదేహం

- భర్తను రాయితో మోది హత్య
- ఈడూరులో ఘటన

అత్తిలి: రోజూ తాగొచ్చి కొడుతుండటంతో విసుగు చెందిన ఓ భార్య భర్తను రాయితో మోది కడతేర్చింది. ఎస్సై కేసీహెచ్ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆకివీడు మండలం అర్తమూరు గ్రామానికి చెందిన పసుపులేటి ఆంజనేయులు (45)కు అత్తిలి మండలం ఈడూరు గ్రామానికి చెందిన సునీతదేవితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహం అనంతరం ఆంజనేయులు ఈడూరులోనే నివాసం ఉంటున్నాడు. అయితే పెళ్లైనప్పటినుంచి మద్యానికి బానిసై, భార్యను తరచూ కొడుతుండేవాడు. దీంతో ఇద్దరూ గొడవపడేవారు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడగా భార్య సునీతదేవి, భర్త ఆంజనేయులపై సిమెంటు రాయితో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ యు రవిప్రకాష్, నర్సాపురం డీఎస్పీ కె.రవి మనోహరాచారి, తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కేసీచ్ స్వామి తెలిపారు.

శ్రీవారి కేశఖండనశాలలో చోరీ

రూ.2.45 లక్షల విలువైన 75 కేజీల కేశాలు చోరీ


శ్రీవారి కేశఖండనశాల

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న కేశఖండనశాల (కల్యాణకట్ట)లో సంక్రాంతి పండుగ రోజు తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ ఘటనలో శ్రీవారికి భక్తులు సమర్పించిన రూ.2.45 లక్షల విలువైన 75 కేజీల కేశాలు మాయమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నిత్యం శ్రీవారిని వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. అందులో అధిక శాతం మంది మొక్కుబడిగా స్వామివారికి తలనీలాలను సమర్పిస్తారు. అయితే మహిళల కేశాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో వాటిని కేశఖండనశాలలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాల్లో భద్రపరచి, తాళాలు వేస్తారు. ఇదిలా ఉంటే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున 1.45 గంటలకు కేశఖండనశాలలోకి ప్రవేశించారు. అనంతరం మహిళల కల్యాణకట్టలో జుట్టు భద్రపరచిన డబ్బాలకున్న తాళాలను పగలగొట్టి, అందులోని 75 కేజీల కేశాలను దోచికెళ్లారు. అదేరోజు ఉదయం విధులకు హాజరయ్యేందుకు కేశఖండనశాలకు వచ్చిన క్షురకులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి, వెంటనే ఆలయ అధికారులకు సమాచారాన్ని అందించారు. ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వెళుతూ అదుపుతప్పి..

ఉంగుటూరు (గణపవరం): మోటార్‌సైకిల్‌పై వెళుతూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం గ్రామానికి చెందిన నడిమింటి సూర్యనారాయణ (77) నారాయణపురంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి మంగళవారం రాత్రి మోటార్‌సైకిల్‌పై రాచూరు బయలుదేరాడు. నారాయణపురం శివారు లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం వద్దకు వచ్చేసరికి మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడిపోవడంతో సూర్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అతనిని ఏలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. సూర్యనారాయణ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుగర్ బాధితుడి ఆత్మహత్య

చింతలపూడి: గాయమైన కాలివేళ్లను తొలగిస్తారనే ఆందోళనకు గురై ఓ మధుమేహ బాధిత వృద్ధుడు మనస్తాపంతో కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. భట్టువారిగూడెంకు చెందిన కంపసాటి వెంకటేశ్వరరావు (75)కు షుగర్ వ్యాధి ఉంది. మూడు నెలల క్రితం కాలి వేలికి గాయమవ్వడంతో వైద్యులు వేలు తొలగించారు. ఇటీవల గాయం ఎక్కువై పక్కనున్న మరో రెండు వేళ్లకు సోకడంతో వాటిని కూడా తొలగించాలని వైద్యులు చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఉన్న కలుపుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుమారుడు శ్రీరామచంద్రమూర్తి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో ఎగిరిపడ్డ కారు


పంటకాలువలో పడిన కారు

చాట్రాయి: పోలవరం గ్రామం వద్ద వెళుతున్న ఓ కారు అదుపుతప్పి పంట కాలువలో ఎగిరిపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి చెందిన ముక్కాల గాలిరెడ్డి, అతని అల్లుడు ఆదికేశవరెడ్డి కుటుంబ సమేతంగా పండుగకు బీరంపాలెం గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. అనంతరం మంగళవారం ఇంటికి తిరిగి వస్తున్నారు. పోలవరం గ్రామం వద్దకు వచ్చేసరికి రోడ్డుపై ఉన్న పెద్ద గొయ్యిలో పడటంతో సుమారు 10 అడుగుల ఎత్తు ఎగిరి రోడ్డు పక్కనే ఉన్న పంట కాలువలో పడింది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో బయటపడగా, సమీపంలో ఉన్న రైతులు వచ్చి కాల్వలో ఉన్న కారును బయటకు లాగారు.

క్లుప్తంగా

వైభవంగా పల్లకీ మహోత్సవం



పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరులోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం అర్చకులు సుందర రామానుజాచార్యులు బ్రహ్మత్వంలో విశేష పూజలు జరిగాయి. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయం నుంచి పల్లకీ మహోత్సవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్లి శ్రీను, సభ్యులు పెనుగొండ ఆంజనేయులు, ఆలం పార్వతి, యాలా కుమారి, పి.విశాలి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అత్తిలి: ఈడూరు గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బింకం నరసింహారావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు ఆధ్వర్యంలో వంట సామాగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులను ఎస్సీనాయకులు మంగళవారం అందజేసారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, మండల ఎస్సీసెల్ నాయకులు సబ్బితి రాజేష్, ఖండవల్లి రవికుమార్, తేలి సుందరరావు, ఇల్లూరి సంపతరావు, పొన్నమళ్ల సంపతరావు, యాళ్ల హోనోక్‌కుమార్, బింకంయోహాన్, తులసే బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఆరవల్లి ఆరాధ్య దైవం శ్రీయోగివేమన



ఆరవల్లిలో శ్రీ యోగి వేమన మందిరం



ఆరవల్లిలో చెరువులో ఏర్పాటు చేసిన వేమన విగ్రహం

అత్తిలి: మానవ జీవితానికి సంబంధించిన అనేక నిత్య సత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి తెలుగువారి హృదయాల్లో శ్రీయోగివేమన చిరస్మరణీయునిగా నిలిచారు. పండిత, పామరులనే బేధం లేకుండా వేమన పద్యాలు సులువుగా అర్ధమవుతాయి. వేమన పద్యాలు వినని తెలుగువాడు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఆరవల్లి ప్రజలకు ఆరాధ్య దైవంగా నిలిచిన శ్రీ యోగి వేమన 98వ జయంతి ఉత్సవాన్ని బుధవారం గ్రామంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను నిర్మించారు. వేమన జయంతి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా సంక్రాంతి వచ్చిందంటే ఇతర గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. కానీ ఆరవల్లి గ్రామస్తులకు మాత్రం జనవరి 18న నిర్వహించే వేమన జయంతే పెద్ద పండుగ. గ్రామానికి చెందిన వారు దేశ, విదేశాల్లో, వృత్తి, ఉపాధి రీత్యా బయటకు వెళ్లిన వారు వేమన జయంతి రోజున తప్పకుండా స్వగ్రామానికి చేరుకుంటారు. వేమన జయంతి సందర్భంగా మహిళలకు, పిల్లలకు, పెద్దలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేస్తారు. వేమనకు ఈ గ్రామానికి చారిత్రకంగా ఎలాంటి సంబంధమూ లేకపోయినా ఊరి ప్రజలకు వేమన ఆరాధ్య దైవమయ్యాడు. దీనిపై గ్రామస్తులను అడిగితే ఒక ఆసక్తికరమైన విషయం చెబుతారు. 1926కు ముందు గ్రామంలో ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించేవి. అలాంటి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన వి.సత్యనారాయణరెడ్డి (దాసు) 1926, జనవరి 18న గ్రామంలో వేమన చిత్రపటాన్ని తాటాకు పందిరిలో ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఇలా పూజలు చేయడం ప్రారంభించిన తరువాత ఆశ్చర్యకరంగా అగ్ని ప్రమాదాలు తగ్గిపోయాయట. అప్పటినుంచి ప్రతి ఏడాది జనవరి 18న వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఇలా 98 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఉత్సవాలు నిర్వహిస్తుండటం విశేషం.అయితే ఈ గ్రామానికి చెందిన ప్రజలు కొన్ని దశాబ్దాల క్రితమే అధిక సంఖ్యలో బర్మా (రంగూన్)కు వలస వెళ్ళారు. ఈ కారణం వల్ల అప్పట్లో ఈ గ్రామాన్ని 'చినరంగం(రంగూన్)'గా పిలిచేవారు. ఇప్పుడు కూడా గ్రామస్తుల్లో అధిక శాతం మంది ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. గ్రామానికి చెందిన కొంత మంది యువకులు శ్రీయోగి వేమన రెడ్డి యువజన సేవా సంఘాన్ని నెలకొల్పి వివిధ సేవా అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. గ్రామంలో యువకులు ప్రస్తుతం గల్ఫ్ దేశాల వాసులే. వీరి సహాయ సహకారాలతో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

కాలభైరవ సంతర్పణ..

వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా జనవరి 18వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఈ అన్నసంతర్పణ కేవలం మనుషులకు మాత్రమే పరిమితం కాదు. కావిడలో పలు రకాల ఆహార పదార్థాలు, పిండివంటకాలను ఉంచి ఊరంతా తిరుగుతూ గ్రామసింహాలు(శునకాలకు) విస్తరాకుల్లో పెట్టి మరీ భోజనం వడ్డించడం విశేషం. గ్రామానికి కాపలాగా ఉంటూ, గ్రామాన్ని రక్షించేది కాలభైరవుడే (శునకం) కాబట్టి 'కాలభైరవ సంతర్పణ' పేరుతో ఈ విధంగా చేస్తున్నారు.

వేమన జయంతే పెద్ద పండుగ



వేమన జయంతే మాగ్రామంలో పెద్దపండుగ. బుధవారం శ్రీయోగివేమన గోస్తనీస్నానం, పల్లకీ ఉత్సవం. అన్నసమారాధన, భజన, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేసాం. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నాం. బహుమతి ప్రధానోత్సవ సభలో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పోటీల్లో విజేతలకు బహుమతులను అందిస్తాము.

– వెలగల అమ్మిరెడ్డి, శ్రీయోగివేమన ఉత్సవ కమిటీ చైర్మన్, ఆరవల్లి.

నేడు ఉచిత మానసిక ఆరోగ్య వైద్య శిబిరం

అత్తిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఉచిత మానసిక ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ ఆర్ సురేఖ తెలిపారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో ఫిట్స్, మతిమరుపు, జీవితంపై విరక్తి, నిద్రపట్టకపోవడం, ఆత్మహత్యప్రయత్నాలు, కొత్తవారితో మాట్లాడాలంటే భయం, జబ్బులేకపోయినా ఉన్నదనేభావన, దెయ్యంపట్టినట్లు ప్రవర్తించడం, చేతబడి అనుమానం, మద్యానికి బానిసకావడం, స్మోకింగ్, డ్రగ్స్ తదితర వ్యాధులకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఉచితంగా మందులు అందజేస్తారని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం డాక్టర్ హన్న కోమలి తెలిపారు. ఉచిత మానసిక వైద్య శిబిరాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని వైద్యులు నాగరాజు, సురేఖ చెప్పారు.

కాలినడక భక్తుల కోసం సత్రం నిర్మాణం



తాడేపల్లిగూడెం పట్టణ సమీపంలోని జువ్వలపాలెంలో నిర్మించిన సత్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వెళ్ళే భక్తుల సౌకర్యార్థం తాడేపల్లిగూడెం పట్టణ శివారు జువ్వలపాలెం రాధాకృష్ణులు, కామధేనువు రిక్వెస్ట్ బస్టాప్ వద్ద రూ.3లక్షలు వ్యయంతో ధర్మసత్రం నిర్మించారు. గ్రామానికి చెందిన కుంచే కృష్ణ, కుంచే సుబ్బారావు వారి తల్లిదండ్రులు శేషగిరిరావు -లీలావతి జ్ఞాపకార్థం పూజలు, యాగాలు, విశ్రాంతి తీసుకునే నిమిత్తం సత్రం నిర్మించారు. ఈ సత్రానికి మంగిన రామలింగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య జయలక్ష్మి, కుమారుడు మంగిన ఆంజనేయులు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో గుండుమోగుల బలుసులు, పాలూరి వెంకటేశ్వరరావు, పాలూరి బూరయ్య, పాలూరి దొరబాబు, పాలూరి విశ్వేశ్వరరావు, కామధేను రాధాకృష్ణులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

తాడేపల్లిగూడెం రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన ముగ్గులు, కుర్చీలాట, రన్నింగ్, స్లో సైక్లింగ్ ఆటల పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సంస్కృతిని ఇలానే కొనసాగిస్తామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గాడ ప్రసన్న, వి.సంధ్య, ఎస్.సింధు, బాలికల కుర్చీలాటలో కె.శ్రావణి, మద్ది కీర్తన, రన్నింగ్ సీనియర్స్‌లో ఎస్.రాజు, జూనియర్స్ రన్నింగ్‌లో నిత్యజీవరాజు, నమ్మిబాలు, కుర్చీలాటలో కె.శ్రావణి, మద్దిశెట్టి కీర్తన, స్లో సైక్లింగ్‌లో ఆర్.సాయిసంధ్య, యు.విజయ, జూనియర్స్ విభాగంలో జానీ, జ్యోతి, పీలా జషిత, జూనియర్స్ రన్నింగ్‌లో ముకుందా, హర్షవర్ధన్‌లకు బహుమతులు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పీలా గాదినాయుడు, పక్కుర్తి మాణిక్యాలరావు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన లక్కీ డ్రాలో విజేతల వివరాలను ప్రకటిస్తున్న డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ బస్సులను ప్రయాణీకులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి, డాక్టర్ కంచర్ల నరసింహారావులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లలిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లక్కీ గిఫ్ట్ స్కీం డ్రాను తీసి మంగళవారం విజేతలను ప్రకటించారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రికి, తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపునకు ప్రయాణించే రహదారులలో బస్సులకు సంబంధించి ఈ లక్కీ డ్రా ను అమలు చేస్తున్నారు. రెండు ప్రాంతాల వైపు మొదటి మూడు బహుమతులను ప్రయాణీకులకు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్స్, ప్రయాణీకులు పాల్గొన్నారు.

అలంపురంలో పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని అలంపురం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జి.సత్యనారాయణ తెలిపారు. వీరి నుంచి లక్ష రూపాయలు నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి వారి వద్ద నుంచి రూ.1050లు నగదు, ఒక కోడిపుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై గోపీనాథ్ తెలిపారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

పెంటపాడు: మండలంలో సంక్రాంతి సంబరాలు ముగిసాయి. ఈ సందర్భంగా పెంటపాడులో ఏపీ వ్యవసాయ కార్మికసంఘం, ఏపీ మహిళాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో గత మూడు రోజల క్రితం నుంచి సంక్రాంతి ముగ్గులు, ఆటల పోటీలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన వారికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ జిల్లా సహాయకార్యదర్శి బి. లక్ష్మినారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి కళింగ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపూజలు

సంక్రాంతి పండుగ ముగింపు పురస్కరించుకొని, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఘనంగా గోపూజలు చేసారు. బైరాగిమఠం గోశాల, ఉమామహేశ్వరంలో పెంట్లమ్మ అమ్మవారి ఆలయం, అలంపురంలో శివాలయం, తదితర ప్రాంతాల్లో గోవులను ప్రత్యేకంగా అలంకరించి ప్రదక్షిణలు చేసి పసుపు, కుంకుమలతో పూజించారు. రైతులకు సంక్రాంతి ఎంతో మేలు చేయాలని, కరోనా ఉపద్రవా లు రాకుండా చూడాలని కోరుకున్నారు. ధర్మప్రచార పరిషత్ సభ్యురాలు కొండ్రెడ్డి హైమావతి, బైరాగి మఠం ఈవో సాయి, సూపరిండెంట్ కొండవీటి నాగబా బు, అర్చకులు పూర్ణచంద్ర త్రిపాఠి, త్రిలోచనదాస్ పూజలు చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు

పెంటపాడు: రెండేళ్లకు ఒకసారి నిర్వహించే బోడపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మ వారి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పూరిగుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, హరతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని భక్తులు, గ్రామ ఆడపడుచులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. రాత్రి అమ్మవారి సేవా మహోత్సవం ఘనంగా జరిగింది. ఆసాదుల నృత్యాలు, గరగలు, బాణసంచా, తీన్‌మార్‌డప్పులు తదితర ప్రచార సామాగ్రితో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. దూరప్రాంతంలో ఉన్న భక్తుల రాకతో బోడపాడు సందడిగా మారింది.